


పా—గారు, మొన్న మధ్యాహ్నం మా యింటికి వొచ్చింది. కొంతసేపు ఆ మాటా యీ మాటా ఆడిన తర్వాత, 'పిల్లలంతా స్కూలుకి వెళ్ళినట్టున్నారు. తిరిగి సాయంత్రం దాకా ఎవ్వరూ రారుగదూ? అబ్బా, ఇంతసేపూ ఒక్కర్తెనూ ఎలా తోస్తుందమ్మా?' అన్నది.

దానికేమని చెప్పాలో నాకేం తోచలేదు. 'చదువుకుంటాను; కుట్టుకుంటాను. అది చేస్తాను; ఇది చేస్తాను.' అని, (అవన్నీ సాధారణంగా ఎవరూ చెయ్యనట్టుగా) ఆడవాళ్ళ పత్రికలలోని, ఆదర్శగృహిణి కార్యక్రమ పాఠమంతా అప్ప జెప్పడానికి, నాకు సిగ్గనిపించింది. అంతకన్నా ప్రమాదమైనది - తన నేదైనా ఎత్తిపొడుపను కుంటుందేమో కూడాను. అప్రతిష్ఠ! ఇంటికి వచ్చిన ఇల్లాలితో రవ్వంత సేపేదో ఇష్టాగోష్ఠి జరపాలిగాని దొరికింది ఇదే అదనని పెద్ద లెక్చరిచ్చేసి, ఆవచ్చినవాళ్ళ ప్రాణం విసిగించి, మనసు చిన్నబుచ్చి పంపడం ఏం మర్యాద?

అందుచేత, ఆకునందకుండా, పోకను పొందకుండా, 'పెద్దతోచడానికేమంత కష్టముంది? ఇంటికీ ఒంటికీ ఎప్పటి కప్పుడేదో ఒకటి చేస్తూ వుండాలని సామెతే అయెను. ఏ సవరణతోనో, ఏ సర్దుబాటుతోనో, నిత్యం సంసారానికి కావలసిన వన్నీ అమర్చుకోవడంతోనే సగం కాలమై పోతుంది. అవలాగుండగా, ఒకొక్కొక్కప్పుడు, ఏదో ఆలోచనా ప్రవాహంలో పడ్డామంటే గంటలు గడిచిపోయిందే తెలియక, పనులుకూడా వెనకబడిపోతాయి' అన్నాను.

'ఏ మోనమ్మా-ఏమాలోచిస్తావో, ఎలాగాలోచిస్తావోగాని, అరగంటసేపు ఒక్కరితనీ కూర్చున్నానంటే, నాకు పిచ్చెత్తిపోతుంది సుమా' అన్నది ఆవిడ.

దానికి ఒక్కమాటలో నేనేం జవాబు చెప్పను? ఊరుకున్నాను. మరికొంత సేపేదో లోకాభి రామాయణం సాగించి, ఆవిడ వెళ్ళిపోయింది. కాని ఆవిడ రేపిన ఆలోచనలుమాత్రం నిలిచి పోయాయి.

అవును. అసలెందు కాలోచిస్తాము? అవి ఎలాగ వస్తాయి? వాటిని అభ్యుదయకరంగా అభివృద్ధి చెయ్యడమెలాగ?- ఇత్యాది ప్రశ్నావళి చుట్టుముట్టింది. ప్రశ్నలతోపాటే, ప్రత్యుత్తరాలు అల్లుకోద మారంభించాయి.

ఎందుకాలోచిస్తాం? అది సృష్టిసహజం గనుక. వసుమతీ గర్భంలో ఓషధుల్లాగ, మానవహృదయాంతరాళ్లో కూడా, (కొంచెమో హెచ్చో, మంచివో, చెడ్డవో) అభిప్రాయాలణిగివుంటాయి. నాపరాతి కొండల నడుమనుంచీ, బీడువారిన భూమిపైనుంచీ - అప్పుడప్పు డక్కడక్కడ, పచ్చనిప్రాణం పొడచూపుతూనే వుంటుంది. అయితే అవి అమూల్యమైన మూలికలు కావచ్చును; అపాయకరమైన విషవృక్షాలు కావచ్చును; పశువులకే పనికివచ్చే పచ్చిగరికే కావచ్చును. కాని పంట చేలులూ, పండ్లతోటలూ, పుష్పవాటికలూ కావాలంటే మాత్రం - దానికి కొంత దైవానుకూల్యం, కొంత పురుషప్రయత్నం అవసరం కాదూ?

ప్రబల తాపవిదీర్ణమైన మేదినిమీద ప్రాణోత్తేజకమగు వర్షం కురియాలి. ఆ తొలకరి చినుకులకు పదనువారిన భూమితలాన్ని, కదలించి కలుపుతీసి, కావలసిన విత్తులుజల్లి, నీరుపోసి, నారు పెంచగల మహానుభావు డుండాలి! అలాగైతేనేగదూ, ఆ మట్టినేల మానవజీవితం,- సఫలం, సౌఖ్యవంతం అవుతుంది!......ఇలాగ ధ్యాననిమగ్ననై, నేను

మైమరచివుండగా, 'నబ్బులు, పిన్నీసులు, దువ్వెనలు' అంటూ గట్టిగా కొట్టినట్టుగా వీధిగుమ్మంలో నిలబడి కేకవేశాడొక చిల్లరవ్యాపారి. అదిరిపడ్డాను. ఒక్క నిముషమాగి, వాడు వెళ్ళిపోయాడు. 'నేనెప్పుడూ తనదగ్గరేమీ తీసుకోకపోయినా, వినిపించుకున్నట్టైనా వుండకపోయినా, అప్పుడప్పుడు మా యింటిముందు కూడా ఆగి, ఎందుకిలా అరిచిపోతాడో, ఆ అబ్బి? ఇల్లు చూస్తే అరిచేఅలవాటా? లేక-ఇతడేజన్మలోనైనా ఉపన్యాసకుడా? పూర్వవాసనలకొద్దీ అలా అరుస్తాడా? కాని, కొంపదీసి క్రిందటి జన్మలో ఆ ఉపన్యాసకుణ్ణి నేనే కాదుగదా? వాళ్ళకవసరమున్నా లేకున్నా ఏవో కొన్ని నీతులూ, నియమాలూ, ప్రజలకు బోధించి, బాధించానేమో? ఆనాటి పీడిత ప్రజానీకంలో ఒకడు కసిదీర్చుకుందుకి అప్పుడప్పుడిలాగ ఏదోరూపంలోవచ్చి, నేను ఉలికిపడేలాగ ఓ బొలికేకవేసి పోతూవుంటాడేమో? ఏమో! అయితే అయివుండవచ్చును!

అదృశ్యమంతా కళ్ళకుకట్టినట్టయి, నాలో-నేనే నవ్వుకున్నాను. వెనుకముందులుగా ఒకదాని నొకటి తోసుకుంటూ మళ్ళీ ఊహాతరంగాలు చెలరేగడ మారంభించాయి.

పిన్నులు, దువ్వెనలు, నబ్బుబిళ్ళలు, — ఎన్నెన్నిరకాల నబ్బులో! లెవండరు, యుడుకిలోను, హిమానీ,- మైసూరు, కేరళ,- అయిదు వందల అయిదు, ఏడువందల ఏడు, సన్‌లైటు! సన్: సూర్యుడు-సూర్యుడు, చంద్రుడు, తారలు-చంద్రుడొక్కడు గాని, తారలెన్నివున్నాయో! ఆకాశమంతా తారలే! భూమిమీద కూడా ఎన్నో తారలు! (సినిమా తారలు, రేడియో తారలు, నాట్యతారలు, నాటికతారలు, ఇంకా ఎన్నెన్నో) ఇన్ని తారలున్నాయన్నమాటే గాని, దూరాన్నిరిచి మినుకు మినుకుమని మెరిసే చుక్కలేగాని, ధృవతారలాగ దారి చూపేదీ, ధైర్యమిచ్చేదీ, ఒక తార అయినా లేదేమో?

అన్నట్టు, పురాణాల్లో వున్నారో యిద్దరు తారలు—వాలి మరణానంతరం, కులాచార ప్రకారం సుగ్రీవుని కిల్లాలయినది ఒక తార. సుధాకరునిమీది ప్రేమాధిక్యంచేత కులాచారాలన్నీ త్రోసిరాజన్న గురుభాగ్య మరొక తార. చిత్రం! వారిద్దరినీ కూడా పతివ్రతా వర్గంలోనే చేర్చారు మునుపటి పెద్దలు. ఎలా పొసగిందో! ఏదో ఘనతలేకపోతే గౌరవిస్తారా? (అప్పటికింకా పార్టీ పద్ధతులూ, పదవీ పట్టాభిషేకాలు లేవుగా!) అవును. నాటివరకూ నిరసనతో చూసిన సుగ్రీవుణ్ణి, ఆతరువాత 'అది తన విధి' అని పతిగా స్వీకరించి సేవించిందంటే, ఎంత హృదయనిగ్రహముండాలి ఆ తారకు!...మరీ, ఆ మరొక తార? ఆవిడది అదొకరకమైన అసాధారణ నూతనపంథా. 'మగడు మగండనంగ, మదిమక్కువ ఎవ్వనియందదో!' అని తనకుతానే నిరూపించుకుంది. అబ్బా! ఆవిడ ఎంత గాఢంగా ప్రేమించిందో? సంఘాన్నంతనీ ధిక్కరించి, ప్రపంచాన్నంతనీ పరిత్యజించి, ప్రణయదేవతా పీఠం జేరాలంటే, ఎంత నైతికబలముండాలి! అది నీచజారత్వంగాదనీ, ఆత్మైక్యతనీ మహర్షులర్థం చేసుకోగలిగే రన్నమాట. పురాతనాచారాలకోసం హృదయగతభావాలని అణిచివేసుకోవడం, బలవత్తర ప్రణయం కోసం సంఘనిబంధనలను ఉల్లంఘించడం-ఏది ఒప్పు? ఏది తప్పు? ఎవరు నిర్ణయించేది?

ధర్మాచరణ అనే పరమార్థంలో-సంఘ గౌరవం పొందడమనే స్వార్థముంది. ప్రేమానుభవమనే స్వార్థంలో,-(సర్వమూ సంతోషంగా సమర్పించే) ఆత్మార్పణ అనే పరమార్థముంది. ఏది స్వార్థం? ఏది పరమార్థం? ఈ ధర్మసూక్ష్మ నిర్ధారణ చెయ్యడ మెలాగ? తప్పయినా, ఒప్పయినా-స్వార్థమున్నా పరమార్థమున్నా, ఒక దృఢసంకల్పంతో, ఒక అసామాన్య త్యాగం చేశారు. అంతేంసుకు ఆ చేసినపని పూర్తిగా తెలుసుకుని, హృదయపూర్వకంగా చేశారు. అర్థం చేసుకుని మనసా అనుభవించిన అనుభూతియే సార్థకం!

ఆకాశంలో అన్ని తార లున్నాయే. అన్నిటిలోనూ - అపలేని అనురాగంతో, లోకాభిప్రాయాన్నతిక్రమించి చందమామను చేరిన తార, ఏ తారో? ఒకవేళ-అన్నితారలూ ఆ తారా ప్రతిరూపాలేనేమో? చంద్రునిమీది మమతతీరక భిన్నాభిన్నాలై, చుట్టుముట్టి చూసి మురుస్తూన్నదేమో! అవన్నీను కోట్లకొలదీ మైళ్ళ దూరంలో ఉన్న అసంఖ్యాకమైన, అగ్నిగోళాలని శాస్త్రజ్ఞు లంటారు. కావచ్చును.

కాని అవన్నీ తారా హృదయంలోని ప్రణయాగ్నిహోత్ర గోళాలు కాగూడదూ?

ఈ ప్రేమసోకడల కొక నిజము, నిజం, లేదుకదా. కారణం-ఒక కార్యసాఫల్యాశ, అసలే కనపడవు. చెంగలువ చందురుని వలచింది. దేనికి? అతడు తనకోసమే వెన్నెల వెలుగులు వెదజల్లేడా? చలి తుపానుల్లో తను వడిలి మడిసినప్పుడు, తనను కాపాడ రాబోతాడా?-ఈ ఆలోచనలన్నీ ఇవతలనున్న మనకేగాని, కోనేటిలోని కలువకన్నెకు లేవు. జాబిల్లి వచ్చాడు. నవ్వు మొగంతో లేచి స్వాగతమిచ్చింది! అతడున్నంతసేపూ, ఆ మధురక్షణాలు ఆనందంతో అనుభవించింది! అంతే ఆవిడకు తెలిసింది: అదే ఆవిడకు కావలసింది!

కాని మరొక తమాషా-రేరాజు రాకకు, ఆగలేకుండా విరియబారింది కలువ; ప్రక్కనే వున్న కమలిని ఒక్క రేకునైనా విప్పలేక పోయింది!-గగనవీధికి దినమణి వచ్చినాడో లేదో, శతపత్ర సుందరి కనులు విచ్చింది; కమనీయ సౌరభము నలుదిక్కులా వెలయించింది; మండు టెండలో కూడా, సుకుమారి అయిన తాను కలకల నవ్వుతూనే వుంది! - చండమయూఖములతో, ముల్లోకములనూ శోషిల్లజేస్తూన్న సూర్యదేవుడు, ఆవిడతో మాత్రం సున్నితమైన సరసోక్తులాడుతున్నాడా? దీని కేమనుకోవడం? పద్మినీ కాంతకు ప్రతిభావంతుడైన ప్రభాకరుడే గాని సుందరుడైన సుధాకరుడు నచ్చలేదా?

అలాగే ఎందు కనుకోవాలి? చంద్రుని చూచి ఆవిడ మొగం ముడుచుకోలేదు. చల్లని చంద్రకిరణ సౌఖ్యానికి పరవశయై కదలనేలేక స్తంభించిపోయింది; చురుకైన సూర్యకిరణస్పర్శతో, అప్రయత్నంగా చైతన్యం కలిగింది; లేచి ఆనందంగా కార్యోత్సాహంతో విలసిల్లింది; తనకు తెలియకుండానే తేనె సోనలు జలజల జాలువారేయి. జీవితం చరితార్థమయింది.

'టంగ్-టంగ్-టంగ్' అమ్మో! మూడైనాక కూడా యింకా ఆలోచనలే! ఇక కార్యరంగంలోకి దిగాలి.

వి. కె. మణి

---

## సాలీనా భరణం ఆరుకోట్లు

పూర్వపు స్వదేశ సంస్థానాలు రకరకాలుగా విలీనం చెయ్యబడిన తరవాత, సుమారు రెండువందల ఎనభై ముగ్గురు మాజీ సంస్థానాధీశ్వరులకి భారతప్రభుత్వం భరణంగా సాలీనా ఆరుకోట్ల రూపాయిలు కర్చుపెట్టడానికి నిశ్చయించింది. ఈ రకపు వర్గాలను ఏదోవిధంగా సంరక్షిస్తూ, తద్వారా సంప్రదాయాలను కాపాడడంకోసం ఇండియా ప్రభుత్వం ఎంత అభిలాష చూపుతున్నదో యిందుమూలంగా తెలుసుకోగలం. దేశంలోని అశేష సామాన్యప్రజల క్షేమం కంటె, పైనచెప్పిన యీ "పెట్టిపుట్టిన" వర్గాలవారి క్షేమాన్నే ప్రభుత్వం ప్రధానంగా ఎంచుతున్నదని అనుకుందికి ఆవకాశం ఉంది. ప్రజాహితమైన ఏ ప్రణాళికల గురించి అడిగినా డబ్బులేదని అడుగడుగునా సాకుచెప్పే ప్రభుత్వం సంస్థానాధీశ్వరుల భరణానికి యింత పెద్దమొత్తం ఎలా సంపాయించిందో విచిత్రమే. బడ్జెటులో కేంద్ర విద్యాశాఖ కోసం ఒక సంవత్సరానికి మంజూరు చెయ్యబడిన మొత్తంకంటె యిది రెండు రెట్లున్నది. ఎవరిమీద యింత మనోవృత్తి కర్చు? సంపాదన శ్రమ అవసరం లేకండా భరణాన్ని పొందే యీ వర్గం దానానికి అర్హత కల్గిన బీదవాళ్లా అంటే అదీ కాదు.

—(ఆచార్య కృపలానీ స్థాపించిన ఆంగ్లవారపత్రిక "విజిల్" నుండి.)